



## "సంగీత సరసుడు"

మొగలాయి చక్రవర్తులలో కడపటి వాడైన ఔరంగజేబు పరిపాలనాకాలములో సంగీతముయొక్క ఔన్నత్యము నశించినది. ఒక్క సంగీతమే కాదు కళలన్నియును అడుగంటిపోయినవి. అందుకు కారణం రాజాదరణ లేకపోవుటయే. సంగీత విద్వాంసులందరు కలసి పాదుషాకు ఒక గుణపాఠం నేర్పించి అతనిచేత కళలను పోషించేటట్లు చేయాలని సంకల్పించుకున్నారు తగిన సమయమునకై యెదురు చూస్తూ యున్నారు.

ఒకనాడు ఔరంగజేబు ఉద్యానవనములో విహరిస్తుండగా అటువైపు కొందరు మేళతాళాలతో ఒక కట్టెను మోసుకొని వెళ్తుండడం చూశాడు. వెంటనే ఒక సేవకున్నిపిలిచి అదేమిటో కనిక్కొనిరమ్మని పంపాడు. కొంతసేపైనతరువాత ఆ సేవకుడువచ్చి "మహా ప్రభూ! మన రాజ్యములో సంగీతమును ఆదరించేవారెవరులేరట, అందు గురించి యది క్షీణించిపోయి మరణించిందట. దాన్నే మోసుకొని తీసుకు వెళ్తున్నారు పాతిపెట్టడానికి." అని చెప్పాడు. అప్పుడు ఔరంగజేబు "గట్టిగా పాతాళమువరకు పాతిపెట్టుమను, మరి బయటకురాకుండా." అని చెప్పమని పంపించాడు సేవకున్ని. అది వినగానే సంగీతవిద్వాంసులందరికి ఆశ నిరాశయై పోయింది. చేసినప్రయత్నము వ్యర్థమయిందని విచారించారు. అందుకే మరి ఔరంగజేబు నంటారు సంగీతమును పాతాళమువరకు పాతిపెట్టుమనిన సరసుడని.

—వి. విజయకుమార్.

## బాకీ వసూలు

స్నేహితుడికిచ్చిన అప్పుకూడ గోడకు వేసిన సున్నంలాంటిదేనంటే కొట్టొస్తారు కొంతమంది ఆకతాయి సోదరులు. కాని ఇది కాచి వడబోసిన నగ్నసత్యం. మరి కాకపోతే అర్జెల్లక్రితం అవసరానికని ఆరు రూపాయలు పుచ్చుకున్న మా కృష్ణగాడు 'అమావాశ్యకి – పౌర్ణానికి' అంటూ ఇప్పటివరకు రాగి నయాపైసా చేతిలో పెట్టలేదంటే మరేమనమంటారు? ఇంతకూ అసలుకథేవిటయ్యా అంటే ఒకరోజున బాకీ వసూలు చెయ్యడం కోసం కృష్ణగాడిదగ్గరకు బయలుదేరాను. ఈ రోజున ఎలాగైనా నా డబ్బు రాబట్టాలని పంతంపట్టాను. ముఖ్యంగా ఆగోవిందుగాడి అప్పుతీర్చేందుకు వెధవ అరణాలకోసం వేపుకు తింటున్నాడు. పూర్ణాహాలు సందు తిరిగానో లేదో వాడే ఎదురుపడ్డాడు. వాణ్ణి చూడగానే నమలకుండా మింగెయ్యాలన్నంత కోపంవచ్చింది. నారౌద్రరూపం చూసి వాడు జెంబేలు పడిపోతాడేమోనని అనుమానం కలిగి, 'అవసరమొచ్చింది డబ్బివ్వరా' అని శాంతంగా అడిగాను. ఇవ్వకపోతే పోయాడు కనీసం నా మాటన్నా ఖాతర్ చెయ్యకుండా దూరంగా ఒస్తున్న అమ్మాయిలకేసి చూస్తూ, 'ఒస్. ఇస్తాంలేవోయ్ బోడి డబ్బు' అనేశాడు తేలిగ్గా. ఇంక నాకు కోపం ఆగిందికాదు. మూడోనేత్రం విప్పేశాను. "దగాకోర్!... రాస్కెల్!... కుక్క!" అంటూ మొదలుపెట్టాను పురాణం. ఇంతలో ఆ యువతులగుంపు మా సమీపంగా ఒస్తూ నా గోల విని మా వేపు చూశారు. నాడబ్బు రాకపోతే పోయెగాని మావాడ్ని మాంచి సస్పెన్సులో పెట్టేశానుకదా! కాని కృష్ణగాడు తొణకకుండా ప్లేటు మార్చి, "అవునవును. మా బాగాతిట్టావు. వాడి నలా తిట్టాల్సిందే! వాడొట్టి ఫూల్! రాస్కెల్! బ్రూట్!... ఈపాటికి వాడికి సిగ్గువచ్చి ఉంటుంది." అన్నాడు నాగేశ్వరరావు ఫోజుపెట్టి.

—కె. నరసింగరావు.

★

## అతనికంటెను ఘనుడు

అవి నేను రెండవతరగతి చదివే రోజులు. పరీక్షలు జరుగుతున్నాయి. ఒకరోజున ఇన్స్పెక్టరుగారు మాక్లాసులోకివచ్చి మమ్మల్ని ప్రశ్నలడుగుతూ నన్ను అబ్బాయ్ రామాయణం ఎవరు వ్రాశారు? అని ప్రశ్నించారు. మామేష్టారు జోసఫ్‌గారు ప్రక్కనేవున్నారనేధైర్యంతో వినయంగా నిలబడి అయ్యా! ఎవరు వ్రాశారో నాకు తెలీదుగాని, నిజంగా నే మాత్రం వ్రాయలేదని జవాబిచ్చాను. అప్పుడాయన అదేమిటండీ నే వ్రాయలేదంటాడని మా జోసఫ్‌గార్ని అడిగారు. దానికాయన అబ్బే లేదండీ, మిమ్మల్ని చూచి భయపడి అలా అన్నాడుగానీ నిజంగా వాడే వ్రాసివుంటాడండీ అన్నారు.

దానికా ఇన్స్పెక్టరుగారు కడుపుబ్బేలా నవ్వి అసలు రామాయణంవ్రాసిన కవిని తెలియచేశారు, మా క్రిష్టియన్ మేష్టారు బుఱ్ఱ గోక్కున్నారు.

—పెదపాటి గోపాలకృష్ణమూర్తి.